
సిద్దిపేటలో భరోసా సెంటర్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, డీజీపీ అంజనీకుమార్, సీపీ శ్వేత

# మహిళల రక్షణకు మరిన్ని సేవలు

**సీఎస్ఆర్ నిధులతో భవనాల నిర్మాణం**

- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట రూరల్ పీఎస్ ఆవరణలో సఖీ, భరోసా కేంద్రాలు ప్రారంభం
- ఆధునిక టెక్నాలజీతో భరోసా సెంటర్
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

సిద్దిపేటరూరల్, సెప్టెంబర్ 30: ఆపదలో ఉన్న మహిళలు, వేధింపులకు గురైన చిన్నారులకు భరోసా, సఖీ కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఎస్ఆర్ నిధులు రూ.1.18 కోట్లతో గౌర పెట్రో కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సికింద్రాబాద్ యాజమాన్యం చొరవతో నిర్మించిన భరోసా, సఖీ కేంద్రాలను శనివారం తెలంగాణ డీజీపీ అంజనీకుమార్, అడిషనల్ డీజీపీ శిఖాగోయల్, డీఐజీ రమేశ్‌నాయుడు, సిద్దిపేట సీపీ శ్వేత, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సిద్దిపేటలో ఆధునిక టెక్నాలజీతో భరోసా సెంటర్ నిర్మించినట్లు తెలిపారు. మహిళల సంరక్షణ కోసం సఖీ, భరోసా, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లతో పాటు బాల రక్ష భవన్ కేంద్రాలు ఒకేచోట నిర్మించినట్లు తెలిపారు.బాధిత మహిళలకు వ్యక్తిగత గోప్యతతో పాటు కౌన్సెలింగ్, న్యాయ సహాయంతో కూడిన రక్షణ లభిస్తుందని, ఇలాంటి రక్షణ వ్యవస్థ ఉందని అందరికీ తెలిసిలా చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు. ఈ భవనాన్ని మహిళా సంరక్షణ సముదాయంగా వినియోగించుకోవాలని సూచించారు. బాధితులు ఎవరైనా ఇక్కడికి వచ్చి న్యాయం పొందవచ్చన్నారు. బాధితులకు ఇక్కడే వైద్యం, న్యాయం, రక్షణ లభిస్తుందన్నారు. అఘాయిత్యాలకు గురైన చిన్నారులు, లైంగిక వేధింపులు, దాడులకు గురైన మహిళలకు ఈ భవనాలు సంరక్షణతో కూడిన భద్రతను కల్పిస్తాయని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా పోలీస్‌శాఖ పనిచేస్తోందని, భరోసా సెంటర్‌లోని లైబ్రరీకి పుస్తకాలు అందించిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణను ప్రత్యేకంగా అభినందించారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ సిద్దిపేటలో భరోసా, సఖీ కేంద్రాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. 2014లో తెలంగాణ సీఎం కేసీఆర్ మానసపుత్రిక అయిన భరోసా,సఖీ కేంద్రాల ఏర్పాటు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, జిల్లాలోని మహిళల రక్షణకోసం మరింత మెరుగైన సేవలు అందించడానికి ఈ సెంటర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తోందన్నారు. మహిళా భద్రతకోసం తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అడిషనల్ డీజీపీ శిఖాగోయల్ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం తెలంగాణ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన షీటీమ్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, తెలంగాణలో మాత్రమే ప్రతి పోలీస్‌స్టేషన్‌లో మహిళా విభాగం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చిన్నారులు, మహిళల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, మహిళల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక విభాగం నిరంతరం పని చేస్తోందని తెలిపారు. భరోసా సెంటర్‌లో ఏర్పాటు చేసిన లైబ్రరీకి 752 పుస్తకాలు అందించిన సతీశ్‌ను మంత్రి, పోలీస్ అధికారులు అభినందించారు. తెలంగాణలో ఇది ఎనిమిదో లైబ్రరీ అని సతీశ్ తెలిపారు. కార్యక్రమంలో గౌర పెట్రో కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ గౌర శ్రీనివాస్, సుబ్బరాజు, నాగరాజు, అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్, మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గా, సిద్దిపేట రూరల్ ఎస్సై కిరణ్‌రెడ్డి, భరోసా సెంటర్ సిబ్బంది, పోలీస్ అధికారులు, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ శ్రీహరిగౌడ్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


భరోసా సెంటర్‌కు పుస్తకాలు అందించిన విద్యార్థిని ఆకర్షణను అభినందిస్తున్న మంత్రి, డీజీపీ, అడిషనల్ డీజీపీ


సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ కర్మాగారం శంకుస్థాపన సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

## ఆయిల్‌పామ్ రైతుకు

# సర్కారు ప్రోత్సాహం

- సాగుచేస్తే ప్రతినెలా ఆదాయం
- ఎకరాకు 12నుంచి 15 టన్నుల దిగుబడి
- ఊరూరా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి
- తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో సాగుచేసేలా ప్రణాళికలు
- పర్యావరణ సమతుల్యతకు ఆయిల్‌పామ్ తోటలు దోహదం
- రూ.300 కోట్లతో ఫ్యాక్టరీ పనులు ఏడాదిలో పూర్తి
- ఫ్యాక్టరీలో అధునాతన సౌకర్యాలు, ఆయిల్‌తో పాటు రిఫైనరీ యంత్రం
- ఆయిల్‌పామ్ పిప్పితో కోళ్లు, పశువులకు దాణా, 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ కర్మాగారానికి శంకుస్థాపన

**ప్రపంచ వ్యాప్తంగా బాగా డిమాండ్ ఉన్న పంట**

సిద్దిపేట అర్బన్/నంగునూరు, సెప్టెంబర్ 30: ఆయిల్‌పామ్ సాగు అన్నదాతలకు అభయహస్తమని, ఈ పంట సాగుతో రైతన్నకు ఆదాయం బాగుంటుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ కర్మాగారానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులకు ఎంతో శుభదినమని రూ.300 కోట్లతో నిర్మించే ఈ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ రైతుల ఆర్థిక బలోపేతానికి ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని ఆయిల్‌పామ్ రైతులకు ఆయిల్‌పామ్ తోటలోనే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగులో చేయాల్సిన మెళకువలను రైతులకు మంత్రి వివరించారు. ప్రతి ఒక్క రైతు ఆయిల్‌పామ్ డెయిరీని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నామని, అదే విధంగా సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి సాగు నీరు తీసుకొచ్చి, 24 గంటల కరెంట్ ఇచ్చారన్నారు. వరి, పత్తి లాంటి పంటలతో ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేలు మాత్రమే వస్తాయి. కానీ పామాయిల్‌తో ఎకరానికి రూ.లక్షా యాభై వేలు సంపాదించవచ్చన్నారు. అకాల వర్షాల వల్ల, ధర లేక, చీడ పీడలు, అడవి పందులు, కోతుల బెడదతో వరి, పత్తి లాంటి పంటలకు ఇబ్బంది ఉంటుంది. ఆయిల్‌పామ్‌కు అలాంటి సమస్యలు ఉండవన్నారు. మూడేండ్ల వరకు కాపాడితే ప్రభుత్వ ఉద్యోగిలాగా ప్రతినెలా ఆదాయం వస్తుందన్నారు. ప్రతి మనిషి దేశంలో ఒక సంవత్సరంలో 19 కిలోల నూనె తింటున్నారు. కానీ దేశంలో 40శాతం మాత్రమే ఉందని.. 60శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. పాలకులను ముందు చూపు లేకపోవడం వల్లనే ఇది జరుగుతుందన్నారు. ఎక్కువ పంట పండితే డిమాండ్ ఉంటదా.. ధర ఉంటదా, ఉండదా అనే అనుమానం రైతులకు ఉండవద్దన్నారు. పామాయిల్ అవసరం చాలా ఉందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో 20 లక్షల ఎకరాలు పామాయిల్ సాగు చేయాలని ప్రణాళికలు రూపొందించారన్నారు.


ఆయిల్‌పామ్ కర్మాగారం ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న మంత్రి హరీశ్‌రావు

### తేమశాతం పెరగడంతోనే పామాయిల్ సాగుకు అనుకూలం

ఆయిల్‌పామ్‌తో రైతులకు అధిక ఆదాయం రావడం మాత్రమే కాకుండా పర్యావరణానికి ఎంతో అనుకూలమైందన్నారు. హెక్టార్ పామాయిల్ తోట 62 మెట్రిక్ టన్నుల కార్బన్‌డైఆక్సైడ్‌ను పీల్చుకొని, 18 టన్నుల ఆక్సిజన్ అందిస్తుందని మంత్రి చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు పర్యావరణ సమతుల్యత కాపాడుతుందన్నారు. వరి, ఇతర పంటలు మార్కెట్‌కు, వాతావరణ పరిస్థితులపై ఆధారపడుతుంది. కానీ ఆయిల్‌పామ్ సాగుకు ఏ ఇబ్బందులు ఉండవన్నారు. గాలిలో తేమశాతం ఉన్న వద్దనే పామాయిల్ తోటలు పండుతాయని.. కానీ కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా నిర్మించిన మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్, మిషన్ కాకతీయతో బాగు చేసిన చెరువుల ద్వారా గాలిలో తేమశాతం పెరిగి పామాయిల్ సాగుకు అనుకూలంగా మారిందన్నారు. సీఎం కేసీఆర్ లేకపోతే ఇన్ని రిజర్వాయర్లు, చెరువులు బాగయ్యేవా... ఆయిల్‌పామ్ సాగు చేసుకునేవాళ్లమా అని మంత్రి అడిగారు. కాంగ్రెస్ హయాంలో ఎవరైనా చనిపోతే సబ్‌స్టేషన్ వాళ్లను బతిమాలి కరెంట్ వేసుకొని స్నానం చేసే పరిస్థితి ఉండేదన్నారు. వారి హయాంలో కనీసం ఉదయం నుంచి సాయంత్రం దాకా కరెంట్ ఉండేదా అని మండిపడ్డారు.


ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి హరీశ్‌రావు

### రాష్ట్రంలో కరువు అన్న మాట లేదు..

సీఎం కేసీఆర్ భగవంతుడి స్మరణ చేస్తాడు కాబట్టే రాష్ట్రంలో కరువు అనే మాట లేదన్నారు. ఇప్పటికే జిల్లాలోని మల్లన్నసాగర్‌లో 15 టీఎంసీలు, రంగనాయకసాగర్‌లో 3 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 8 టీఎంసీలు నింపి ఉంచామన్నారు. యాసంగిలో అవసరమైనప్పుడు ఆ నీటిని విడుదల చేస్తామన్నారు. రూ.300 కోట్లతో నిర్మించే ఈ ఫ్యాక్టరీ పనులు ప్రారంభించామని, ఒక సంవత్సరంలోపు పూర్తవుతుందన్నారు. ఇంత పెద్ద ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ దేశంలోనే లేదని.. ఒక గంటకు 120 టన్నుల పామాయిల్ క్రషింగ్ చేసే సామర్థ్యం ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడైనా 60 మెట్రిక్ టన్నులు, 90 మెట్రిక్ టన్నులు క్రషింగ్ చేసే సామర్థ్యం ఉన్న ఫ్యాక్టరీలు మాత్రమే ఉన్నాయని ఇది వాటి కంటే పెద్దదన్నారు. ఇక్కడ నిర్మించే ఫ్యాక్టరీలో అన్ని రకాల అధునాతన సౌకర్యాలు ఉంటాయని, క్రూడ్ ఆయిల్‌తోపాటు రిఫైనరీ యంత్రం కూడా ఇక్కడే ఉంటుందన్నారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ పిప్పితో కోళ్లకు, పశువులకు దాణా తయారవుతుందన్నారు. మిగిలిన పిప్పిని 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే యంత్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కర్మాగారం నుంచి వచ్చే నీటిని మళ్లీ ఇక్కడే శుద్ధి చేసి ఉపయోగించుకుంటారన్నారు. ఇక్కడ తయారైన ఆయిల్ ప్యాకెట్ మన ఊర్లోకే వస్తుందన్నారు. స్వామినాథన్ మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తమిళనాడు వెళ్లిన మంత్రి నిరంజన్‌రెడ్డి రాలేకపోయారని, ఇక్కడ కర్మాగారం ఏర్పాటు చేయడం మంత్రి నిరంజన్‌రెడ్డి ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ రైతులందరికీ శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ వంగ నాగిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జడ్పీటీసీ తడిసిన ఉమ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ పామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దిపడగ కిష్టారెడ్డి, అన్ని మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.


నర్మెట సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు


నర్మెట సభకు పెద్దఎత్తున హాజరైన రైతులు

### నేడు ఆయిల్‌పామ్ రైతులకు శుభదినం..




సిద్దిపేట ప్రాంత రైతులకే కాకుండా చుట్టుపక్కల ఆరు జిల్లాల ఆయిల్‌పామ్ రైతులకు నేడు ఎంతో శుభదినమని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయిల్‌పామ్ కార్మాగారానికి 65 ఎకరాల స్థలం కేటాయించినందుకు మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 30 ఏండ్ల కిందట ఖమ్మం జిల్లాలో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి ఎంతో ఆర్థికాభివృద్ధి సాధించారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పిస్తున్నారని, పామాయిల్ సాగులో సిద్దిపేట జిల్లా ఆదర్శంగా నిలవాలని కోరారు. 12 నుంచి 15 నెలల్లో ఆయిల్‌పామ్ కర్మాగారం ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు.

### దేశానికి అన్నంపెట్టే స్థాయిలో తెలంగాణ



దేశానికే అన్నం పెట్టే స్థాయిలో తెలంగాణ రాష్ట్రం ఉందని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తుంటే, మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. రైతులకు మేలుచేసే ఆయిల్‌పామ్ కర్మాగారానికి శంకుస్థాపన చేసినందుకు రైతుల పక్షాన మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను రైతులు ఉపయోగించుకొని అధికసంఖ్యలో ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాలతోపాటు ఇతర దేశాలకు తెలంగాణ రాష్ట్రం ఆయిల్‌పామ్ గెలలను ఎగుమతి చేసే స్థితికి రైతులు చేరుకోవాలని ఆకాంక్షించారు.

### సిద్దిపేట జిల్లాలో 11వేల ఎకరాల్లో సాగు



ఇప్పటివరకు సిద్దిపేట జిల్లాలో 11వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. మరింత పెంచే లక్ష్యంతో ఈ సంవత్సరం కూడా ఆయిల్‌పామ్ సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తూ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటలు వేయడంతో అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు అంతర పంటలుగా సాగుచేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలో ఖమ్మం తర్వాత సిద్దిపేట జిల్లాలోనే ఆయిల్‌పామ్‌ను అధికంగా సాగు చేస్తున్నారన్నారు.

### తెలంగాణ చరిత్రలో ఇదొక మైలురాయి..



తెలంగాణ చరిత్రలో ఇదొక మైలురాయి అని రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ హనుమంతరావు అన్నారు. సిద్దిపేట ప్రతి అంశంలో రాష్ట్రానికే దిక్సూచిలా ఉంటుందని చెప్పారు. ఆయిల్‌పామ్‌ను మించిన పంట లేదు. ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉన్న పంట అని, జిల్లాలోని ప్రతి రైతుతో నేరుగా మంత్రి హరీశ్‌రావు టెలీకాన్ఫరెన్స్‌లో పంట గురించి వివరిస్తారని చెప్పారు. మంత్రి హరీశ్‌రావు ప్రోత్సాహంతోనే ఆయిల్‌పామ్ సాగులో సిద్దిపేట జిల్లా ముందంజలో ఉందన్నారు. రైతులు అధికసంఖ్యలో ఆయిల్‌పామ్ సాగు చేసుకొని రాబడులు పొందాలని కోరారు.

# టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

**పారదర్శకంగా విధులు నిర్వహించాలి ▪ విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు**


సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీజీపీ అంజనీకుమార్

- ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు సేవలందించాలి
- ఏ ఒక్కరూ తప్పు చేసినా పోలీస్ వ్యవస్థకే మాయనిమచ్చ
- రక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- క్రైమ్ రేట్‌ను తగ్గించే విధంగా కృషి చేయాలి
- రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్
- సిద్దిపేట పోలీస్ కమిషనరేట్, పోలీస్ కన్వెన్షన్ సెంటర్ల సందర్శన
- జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 30 : విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాయంతోపాటు జిల్లా కేంద్రంలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌ను ఉమెన్ సెఫ్టీ వింగ్ అడిషనల్ డీజీపీ శిఖాగోయల్, రాజన్న జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు, సిద్దిపేట సీపీ శ్వేతతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీజీపీ అంజనీకుమార్ జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మారాలని, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ప్రతి ఒక్క అధికారి అందిపుచ్చుకోవాలన్నారు. పోలీస్ వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఏ ఒక్క పోలీసు చిన్న తప్పు చేసినా మొత్తం డిపార్ట్‌మెంట్ మీద పడుతుందని, ప్రతిఒక్కరూ ఆలోచించుకొని విధులు నిర్వహించాలని సూచించారు. ఆత్మగౌరవం, క్రమశిక్షణ, పారదర్శకతతో విధులు నిర్వహించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సంబంధిత పోలీస్ అధికారులు ప్రతిరోజూ గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై ప్రజల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. క్రైమ్ రేట్ తగ్గించే విధంగా ప్రతిఒక్కరూ ఒక కుటుంబం లాగా కలిసి పని చేయాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా ఛేదించి సరైన సమయంలో చార్జిషీట్ వేయాలన్నారు. ప్రభుత్వం అధునాతన వాహనాలు అందించిందని, ప్రజల రక్షణ, సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ చాలా ముఖ్యమన్నారు. ఒక సబ్ డివిజన్ స్థాయి నుంచి ఒక కమిషనరేట్‌ను ఏర్పాటు చేసుకోవడం చాలా అదృష్టమని, పోలీస్ కమిషనరేట్‌ను అద్భుతంగా, ఆధునిక టెక్నాలజీతో నిర్మించామన్నారు.. పచ్చదనం, పరిశుభ్రత ఒక మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉందని సీపీ శ్వేతను, అధికారులను, సిబ్బందిని డీజీపీ అభినందించారు. పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌ను కూడా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అద్భుతంగా నిర్మించామన్నారు. విశాలమైన హాల్, విశాలమైన పార్కింగ్‌తో ఆహ్లాదకరంగా ఉందన్నారు. అనంతరం సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత జిల్లా భౌగోళిక పరిస్థితులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల పరిధి, జరుగుతున్న నేరాలు, బార్డర్ పోలీస్ స్టేషన్లు, జిల్లాలో నూతనంగా నిర్మించిన ప్రాజెక్ట్‌లు, నిర్మాణంలో పోలీస్ స్టేషన్లు, పోలీస్ ఆరోగ్య రక్షలో భాగంగా పోలీస్ హెల్త్ ప్రొఫైల్ తదితర వాటి గురించి డీజీపీకి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, రాంచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు రమేశ్, సతీశ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.